


నూటయేబదియేండ్ల క్రింద ఒక దేశంలో ఒకవిప్లవం జరిగింది. అంతకు పూర్వం ఇటువంటి విప్లవాలు—ఆదేశంలో మాత్రమేమి, యెన్ని దేశాలలోనైనా సరే జరుగలేదని, లేదు. తరువాత జరుగలేదని చెప్పటానికీ వీలులేదు. ఇకముందు జరుగవని చెప్పటానికీ వీలులేదు. అసలు మానవుని చరిత్ర అంతే! విప్లవములయొక్క సమాహారమే! ఒకప్పుడు ఒక దేశంలోజరిగినవిప్లవం ఒకమాదిరిగా ఉంటుంది. ఇంకొక దేశంలో జరిగిన విప్లవం మరొకమాదిరిగా ఉంటుంది. అట్లాగే కాలాన్ని బట్టి కూడా విప్లవాల స్వరూపాలు మారుతూఉంటవి. ఇంత, కాల భేదం ఉన్నా, దేశభేదం ఉన్నా, విప్లవ స్వరూపభేదం ఉన్నా, జరిగేది ఒక్కటే, విప్లవం ఎప్పుడు తరంగాలు తరంగాలుగా వస్తుంది. మూడునాలుగు తరంగాలు కలిసి ఒక విప్లవం అవుతుంది.

ఒక దేశంలో ఒక కాలంలో పరిస్థితులు బాగుగాఉండవు. ఈబాగాలేకపోవటానికి హేతువులుగా కొందరధికారులు కన్పిస్తారు.

ఒక విప్లవతరంగం లేస్తుంది. ఆ అధికారులను నాశనంచేస్తుంది. విప్లవతరంగం అంటే వాళ్లూ కొందరు మనుష్యులే. వెంటనే మరియొకవిప్లవతరంగం లేచి మొదటితరంగాన్ని హతమారుస్తుంది. ఇట్లా రెండు మూడు ఆవృత్తులు జరుగుతేనే కాని యేవిప్లవమూ పూర్తిగా సద్దుమణగదు. మొదటి విప్లవతరంగం, నాటి దుర్మార్గాన్ని సంహరించటంకోసమేకదా అవతరించింది! ఆ తరంగాన్ని మరియొక తరంగం ఎందుకు సంహరించింది? అని ప్రశ్న. తరంగంలేని స్థితి మొదటి తరంగానికి దుర్మార్గంగా ఉన్నదని యెలా అనిపించిందో, రెండవతరంగానికి మొదటి తరంగం అట్లా అనిపించింది ఇట్లాగే అనిపిస్తూఉంటుంది. సముద్రంలో తరంగాలు వస్తూఉంటవి. ప్రతీదీ ఒడ్డుకు వస్తుంది. విరుగుతుంది. ఆతరవాతవచ్చేతరంగం తాను విరుగనిదానికిమల్లే పెద్ద యెత్తుగడ యెత్తుతుంది. సముద్రపుటొడ్డున మనము నిలుచుంటామా? దాని యెత్తుగడ చూస్తే, ఇంకేముంది, మనమీదికివచ్చి పడ్డదనుకొంటాం. అది అంత ఉద్ధృతంగా వచ్చి మొదటితరంగం విరిగిన చోటే తానూ విరిగి ఊరుకొంటుంది.

ఇది రెండు తరంగాల నడుమ జరిగిన కథ. మొదటి తరంగం లేచి ఆ పూర్వులలో కొందరు దేశద్రోహులని వారిని సంహరించింది. ఈ తరంగమునకు నాయకులున్నారుగా కొందరు? తరువాత తరంగం లేచి యీ నాయకులందర్నీ పట్టుకొన్నది. తత్పూర్వ నాయకులు మహానుభావులని వాళ్లను సంహరించినందుకు ఈ ప్రథమ తరంగనాయకులను రెండవ తరంగపు నాయకులు బందీచేసి వాళ్లను ఉరితీసిన కథ. ఈ కథలో ఇది ఒక ఉపాఖ్యానం.

ఆ దేశాన్ని బట్టి మనుష్యుల పేర్లు మారుతవి. అంతే భేదం. సంహరింపబడిన దేశనాయకుడు గొప్పవాడు. అతని పేరు 'డామట్' అనుకొందాము. ఈ డామట్ యొక్క సంహారానికి హేతువుగా ప్రథమ విప్లవతరంగంలోని యేడుగురు నాయకులను పట్టుకొన్నారు. అందరికీ ఉరిశిక్షలు వేశారు. అందరినీ ఉరి తీశారు. కాని అందరినీ ఒక్కసారి ఉరితీయలేదు. ఒకని తరువాత ఒకనినిగా విచారించటం శిక్షించటం జరిగింది.

ఈ విచారణ ఆషాఢమాసంలో మొదలుపెట్టింది. ప్రతివానియొక్క విచారణఅయిన తర్వాత. అతడు దేశద్రోహి అని నిర్ణయం జరిగినతర్వాత వానికి ఉరిశిక్ష విధించకపూర్వం ఖైదీని, 'నీవేమి చెప్పకొంటావు?' అని అడగటం విచారణయొక్క పరిపాటి. ఆ యేడుగురు ఒకళ్లతర్వాత ఒకళ్లు ఏమేమి చెప్పారో వ్రాయటమే ఈ కథయొక్క ముఖ్యోద్దేశం.

ఆ మనుష్యుల పేర్లు చాలా అనవసరం. అందుచేత మా సాలవారిగానే వ్రాస్తే మంచిది.

ఆషాఢం—

నేను దేశముయొక్క అభ్యుదయాన్ని మనస్సులో పెట్టుకొనే యీ పని చేశాను. నాకు డామట్టునందు ఏవిధమైన వ్యక్తిగత ద్వేషమూ లేదు. ఆయన మహానుభావుడని నాకు తెలుసు. కాని ఆయన బ్రతికిఉంటే దేశానికి యింకా అనర్థం వాటిల్లుతుంది. అనర్థపరంపర వాటిల్లుతుంది. దానిని తొలగబెట్టటంకోసమే నేనతని వధవిషయంలో సౌఖ్యం కలిగించుకొన్నాను. అధికారులైనన్ను విచారణచేయటానికి కూర్చున్న

మీరందరు ఎంత దేశభక్తులో నేనూ అంతే దేశభక్తుణ్ణి. మన దేశంలో న్యాయము, ధర్మము, శాంతి ఉండాలని మీ రెంత వాంఛిస్తున్నారో నేనూ అంతే వాంఛిస్తున్నాను. నేను చనిపోయినాసరే నేను చేసినపని దోషమని నేననుకోను. త్రికరణశుద్ధిగా నేను దేశముయొక్క అభ్యుదయాన్ని వాంఛించే యీ పని చేశాను. ఈ మనదేశం జయించుగాక. నేను మరణించిన తరువాతగూడ నా యాత్మ సర్వథా ఈ దేశాభ్యుదయాన్నే పరిశీలిస్తూ ఉంటుంది. నేను నాయాత్మతో ఈదేశముయొక్క సౌభాగ్యాన్ని పరిశీలిస్తూ ఉంటాను.

శ్రావణం——

మీరు నన్ను శిక్షిస్తారని నాకు తెలుసు. శిక్షించటం మీస్వభావంలో ఉంది. మీకు క్రొత్తగా అధికారంవచ్చింది. ఆ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. మేమందరము నిజముగా దేశాభ్యుదయాన్ని మనస్సులలో పెట్టికొని ప్రవర్తించినవారము. డామట్‌ను నేను చంపానంటే ప్రజాభిప్రాయాన్ని అనుసరించే చంపాను. ఇప్పుడు నన్ను విచారించేవాళ్లుకూడ ఆరోజుల్లో డామట్ చస్తేనేగాని ఈదేశం బాగుపడదని అనుకొన్నవాళ్లే. నే నేమీ అన్యాయం చేయలేదు. అధర్మం చేయలేదు. అతనిని వధ చేయుట పాపమని నే ననుకోటంలేదు. ఎన్నడూ అనుకోను. అతనిని వధించాను కనుక నే మీరు నన్నీనాడు విచారించి నాకు శిక్ష వేయటానికి తగిన శాంతపరిస్థితు లేర్పడినవని నేను నమ్ముతున్నాను. అధికారము మీచేతిలో ఉందికనుక ఇట్లా చేస్తున్నారు. నేను దేశద్రోహిని వధించాను. మీరు దేశభక్తుని వధిస్తున్నారు. నా ఆత్మ ఎప్పుడూ ఈదేశాన్ని వదలిపోదు. ఈదేశమునకు జయమగుగాక.

భాద్రపదం——

నేను డామట్‌ను వధించానని విచారించటమే లేదు. నాకు సాధ్యమైతే వీలుంటే అటువంటి డామట్లను వందమందినైనా సంహరిస్తాను. ఆ డామట్‌ను వందసార్లైనా సంహరిస్తాను. ఏఒక్కడిమూలంగా ఈ దేశం పరాధీనస్థితిలో ఉందో, ఈ దేశంయొక్క మానమర్యాద లన్నీ నాశనం కాబోయే స్థితిలో ఉన్నవో, అతనిని సంహరించటంలో నా కేమీ తప్పు కనిపించటంలేదు. నా స్థితిలో మీరుంటే మీరుకూడా తప్పకుండా ఆ పని చేసేవాళ్లు. నేను అతనిని వధించకపోతే నేను దేశద్రోహినని అనిపించుకొనేవాడను. మీరే నన్ను దేశద్రోహియనెడివారు. నేను మీకు చేసిన యుపకారము మీ కిప్పుడు తెలియదు. మీరు చేస్తూఉన్న యీ పనిలో ఉన్న దోషం మీ కిప్పుడు తెలియదు. నేను చేసిన మహాఘనకార్యంయొక్క సత్ఫలము మీ రిప్పుడనుభవిస్తున్నారు. భవిష్యత్ప్రజ లింకా అనుభవిస్తారు. నాకు శిలావిగ్రహములు వేసి భవిష్యత్తులో ఇంటింటా నన్ను పూజిస్తారు. భవిష్యచ్చరిత్ర మిమ్మల్ని నిందిస్తుంది. దుర్మార్గులైన మీరు మహాదేశభక్తుడైన నన్ను హత్యచేసిన దుర్మార్గులుగా చరిత్రలో నిలచిపోతారు. నేను తిరిగి మళ్లీ యీ దేశంలో నే పుట్టాను.

నా ఆత్మ ఈ మంటిలో కలిసిపోయి ఉంది. ఈమంటికి జయమగుగాక. ఈదేశానికి అభ్యుదయమగుగాక.

ఆశ్వయుజం——

(ఇతడు ఏడుస్తూ చెప్పాడు.) నాకు భార్యాబిడ్డలూ ఉన్నారు. నేను డామట్‌ను చంపలేదు. డామట్ చాల గొప్పవాడని నాకు తెలుసు. నాకేమీ తెలియదు. తక్కినవాళ్లు నన్ను మాయలో పెట్టారు. నేను డామట్‌కు చాలా భక్తుణ్ణి. ఆయన నన్ను చాలా ప్రేమగా చూసేవాడు. అనేకసార్లు నన్నాయన ఆశీర్వదించాడు. ఒకసారి అన్నాడుకదా! నీవు నన్ను చంపినా నేను నిన్నేమిచేయనన్నాడు. నామీద ఆయన కంత ప్రేమ. అల్లాంటివాణ్ణి నేనేదైనా చేశాననటం అసంభవం. ఈసాక్ష్యాలన్నీ బనాయించారు. ఇందులో ఒక్కటీ నిజం లేదు. మీ రాజకీయపు న్యాయవాది నాతరఫున చక్కగా వాదించలేదు. నేను సొంతంగా న్యాయవాదిని పెట్టుకొనేందుకు నాకు డబ్బులేకపోయింది. నేనుపేదవాణ్ణి, నేను చచ్చిపోతే నాపెళ్లాంబిడ్డలు ఎట్లా బ్రతుకుతారు? మీరు చేస్తున్నదిది అన్యాయం.

(అని యేడుస్తుంటే న్యాయాధికారి బలవంతంగా రక్షకభటులచేత అతనిని క్రిందకు లాగించాడు.)

కార్తికం——

నేను చెప్పవలసింది ఏమీ లేదు. నే నొక్కటే చెపుతున్నాను. నేను దోషినిగా అంగీకరిస్తున్నాను. అప్పుడు డామట్‌ను వధిస్తేనేగాని దేశానికి అభ్యుదయం జరుగదని నేననుకొన్నాను. అంతదాకా ఎందుకు! ఇప్పుడు మమ్మందరినీ ఉరి తీస్తేనేకాని న్యాయం జరుగదు అని మీ రనుకోటం లేదా? అప్పుడల్లాగే మే మనుకొన్నాం. రేపుప్రొద్దున మమ్మల్ని ఇలా మీరు శిక్షించినందుకు ఇంకొకళ్లు వచ్చి మిమ్మల్ని శిక్షించకూడదా? శిక్షించటం శిక్షించకపోవటం అధికారం చేతిలోకి రావటంలోనేగదా ఉంది. అప్పుడు మా కధికారం ఉంది. మేము చేశాము. మీ కిప్పు డధికారం ఉంది. మీరు చేస్తున్నారు. రేపీ యధికారం ఇంకొకరికి వస్తుంది. వాళ్లు చేస్తారు. అప్పుడు డామట్‌ను చంపటం దేశానికి అభ్యుదయం. అతనిని సంహరించిన వాళ్లని శిక్షించటం నేడు దేశానికి అభ్యుదయమనుకొంటే మీరు చేయండి. ఎప్పు డేది యభ్యుదయమో? ఎవరు చెప్తారు? ఎవరికి తెలుస్తుంది? అధికారంలో ఉన్నవాళ్లు అది అభ్యుదయమనుకొంటే అది అభ్యుదయమవుతుంది. నేను చచ్చిపోతున్నానని నాకు దిగులు లేదు. లేదని కాదు. ఉంది. బ్రతికిఉంటే అనుభవించే భోగాలుఅనంతంగా ఉన్నవని నాకు తెలుసు. నేను చచ్చిపోవటంవలన ఈదేశానికి అభ్యుదయం జరుగుతుందని మీ రనుకొంటే తప్పకుండా చేయండి ఇప్పు డనుకొనేవాళ్లు మీరుగనుక. దేశమాతా! జయ! జయ!

మార్గశిరము——

మీరు నన్ను నేను "ద్రోహినా? కానా?" అని అడుగుతున్నారు. నేను కానంటే మీరు వదలిపెట్టరు." అవునంటే మీరు సంతోషించరు. నన్నడగటం ఇదొక—లాంఛనం. మీ లాంఛనం నే నెందుకు జరపాలి? అని ఊరుకోను. మీ కిది లాంఛనమే కాని ఇందులో నా కొక తృప్తి ఉంది. నా దేశప్రజలకు నా ఆత్మ యిటువంటిదని చూపవలసినతె అవసరం నాకు ఉంది. డామట్‌ను హత్యచేసినవారిలో నా సోదరులు ఇద్దరు ముగ్గురు డామట్‌ను ప్రశంసించారు. కొందరు ద్రోహులమని ఒప్పుకొన్నారు. కొందరు ఒప్పుకోలేదు. నే నటు చెప్పినా యిటు చెప్పినా వారిలోనో వీరిలోనో చేరుతాను. నా దేశప్రజలకు నే నిక్కడనుండి అభ్యర్థన చేస్తున్నాను. మీరు నన్నిలా శిక్షిస్తే పనికిరాదు. నేను చేసినది హత్య కాదు. చోరుని, జారుని హత్యకారుని విచారించినట్లు నన్ను విచారించటానికి మీకు హక్కులేదు. యుద్ధములో ఓడిపోయిన రాజును విచారించి శిక్షించట మెట్లా తప్పో, మీరు నన్ను విచా

రించటం అంతే తప్పు. ఓడిపోయిన రాజే గెలుస్తే, గెలిచినరాజు ఓడితే, మళ్లీ అల్లా జరుగవలసిందేనా? వాడికి సైన్యం తక్కువ, యుద్ధనీతి తక్కువ, అందుచేత ఓడాడు. యుద్ధంగెలిచేందుకు ఒకరాజు అనేకయెత్తులు ఎత్తుతాడు. అది తప్పనటం దుర్మార్గం. మే మధికారంలో ఉన్నప్పుడు మాకు న్యాయమని తోచింది చేశాం. మీ రిప్పుడు చేస్తున్నట్లే అప్పుడు చేశాం. మీరు మమ్మల్ని శిక్షించటం మానవధర్మానికి, రాజకీయధర్మానికి వ్యతిరేకమైనపని. మేము ఈ దేశాన్ని బాగుచేయవలెనని ప్రయత్నిస్తే ఈ దేశ మింత అథమస్థితిలోకి వచ్చిందని నేను విచారిస్తూన్నాను. మీవంటి అవివేకులయొక్క చేతులలోనుండి దేశమాత, సంరక్షింపబడుగాక.

పుష్యం—

(సూర్యునిసప్తాశ్వములు మణికింకిణీనినాదమంధరంగా పరుగెత్తినవి. ఐమూలలుగా ప్రసరించిన మార్తాండదేవుని కిరణజాలం హేలామనోహరంగా, వంపులు తీరిన వజ్రశలాకలవలె, వెన్నెలతీవలబెత్తాలవలె, ప్రాగ్దిశాకామినీవదనసరోజసంక్లుప్తమణితిలక ఘృణిఘుటికలవలె, ప్రసరించినవి. అనంతమధురప్రాగాకాశమాయమదిశమ్ము ఈశానదిక్పర్యంతము రంగారు రంగవల్లులు తీర్చిన సంక్రాంతి ముగ్గులవలె ముగ్ధరమణీయమైనవి. స్వర్గద్వారములు తెరచినట్లు, లోనికామధేనువిషాణకాంతిప్రరోహములు ముంగిట తళతళలాడినట్లు, కల్పవృక్షకిసలయమరీచికావీచికామేచకేతరనవాలోలబాల ప్రరోహసంతానమ్ము మధురచింతాసముద్గతభావనారూపముల వలె, తూరుపుము త్తైనువముంగిలి నలంకరించినట్లు తోచెను. సూర్యదేవునియేడు గుఱ్ఱములు బిలబిల బయలుదేరి తిర్యక్ప్రసారసముద్దీపితపురతఃప్రసరణహేలావల్గువల్గనచమత్కార ఖురమధురశబ్దపరిరంజితములై సముద్దీపించెను)

మాఘము—

(ఏడవ వాడిట్లు చెప్పెను.)

నేను దోషినో కానో? నిర్ణయించవలసినది భగవంతుడు. మీరు విచారించవచ్చును. శిక్షించవచ్చును. దోష మేమియు లేదు. నేనీ లోకంలో బ్రతికియున్నాను. అది యింత వరకూమాట. బ్రతికిఉన్నానుగనుక కొన్ని పనులు చేయాలి. చేశాను. నేను చేసింది తప్పనుకొంటే నేను చేసేఉండను. నేననుకొన్నది తప్పు, మీరనుకొన్నది ఒప్పు, కావటం సాధ్యం కాదు. అయిన దైపోయింది. నన్ను బ్రతికించండని మిమ్మ బ్రతిమాలను. బ్రతిమాలినా మీరు బ్రతికించేది లేదు. ఆ బ్రతికించటం మీ చేతుల్లో లేదు. మీ రింకెవళ్ళ చేతుల్లోనో ఉన్నారు. వాళ్లు మరింకెవళ్ళ చేతుల్లోనో ఉన్నారు. ఆ అసలు చేతులు కాలప్రవాహానివి. డామటన్ ను చంపానని నేననను. దానికి కారణం కాలపురుషుడు. అతడు సర్వాధికారి. అప్పుడు నాచేత అట్లా చేయించాడు. ఇప్పుడు మీచేత ఇట్లా చేయిస్తున్నాడు. కాదు, ఈ దేశానికి అభ్యుదయం నేను కోరుతున్నానంటే, నేను కోరితే జరుగుతుంది— కోరకపోతే జరగదా! నా వంటివాళ్లింతమంది చచ్చారు? ఇంకెంత మంది చస్తారు. అందరూ నాకుమల్లేనే చావక్కర్లేదు. ఎవ డెట్లా చావలసిఉంటే వాడట్లా చస్తాడు. కొంత మీ దయవల్లనే నిట్లా చస్తున్నాను. నా ఆత్మ ఈ దేశాన్ని పట్టుకొని ప్రాకులాడాలని నాకు లేదు. అసలు ఇంకా ఈ దేశ మెందుకు? అసలొక దేశ మెందుకు? అవునో! కాదో? మన కేమీ తెలియదు. నా కొక్కటే చింత. తరువాత ఏమిటో నేనింతవరకు విచారించలేదు. మీరు పెందరాడి నన్ను ఉరితీస్తే తరువాత యేమిటో తెలిసికోటానికి అప్పుడైనా వీలవుతుందేమో చూద్దామని ఉంది. నమస్కారం.

---

# సూక్ష్మంలో మోక్షం

(19 వ-పేజీ తరువాయి)

ఆ అమ్మాయిలలో మొదటిఆమె "పరమేశ్వరా! జగత్తుకంతకూ ధనమేకదా! మూలము. మళ్లీ జన్మలో నాకు మరింత డబ్బున్న మగడు కావాలి! డబ్బున్నందుకు తనింత తిని ఎదుటివాళ్ల కింత పెట్టి దానధర్మాలకోసం, మంచిపనులకోసం దానిని వినియోగించే ధర్మగుణం కూడా నా భర్త కుండాలి!" అని కోరుకుని బుడుంగున మునిగింది.

రెండోపిల్ల— "స్వామీ! ధనం శాశ్వత మయింది కాదు. విద్యవున్నట్టయితే ధనమూ, కీర్తీ దాని వెంబడే వస్తాయని పెద్దలంటారు. కనుక మళ్లీజన్మలో విద్వాంసుడూ, పండితుడూ, కవీ అయినటువంటి భర్త దొరకాలి!" అని మునిగింది.

మూడవఆమె, దేవా! నాకు విద్య,కీర్తి, ధనము అధికారం కలిగిన భర్త దొరికితే! మరేమీ వద్దు! కాబట్టి అటువంటి ఒకరాజను నాకు వచ్చే జన్మలో పతిగా చేయుము. తండ్రీ!" అని నమస్కరించి మునిగిపోయింది.

నాల్గవఆమె "ఇప్పుడు! వీళ్ళందరూ కోరుకున్నవి, అందంక్రింద రద్దేను. కనుక నాకు సౌందర్యం విద్యా ప్రతిభ అధికారం ధనం కల మొగుడు కావాలి" అని మునిగింది.

ఆ నలుగురు అమ్మాయిలూ మునిగిపోగానే పేదబ్రాహ్మణునకు కూడా ఏదో కోరిక కోరుకొని చనిపోద మని బుద్ధి పుట్టింది.

ఆఖరుకు "దేవా! నాది వక్కటే చిన్నకోరిక! ఇప్పుడు కోరికలు కోరుకొని మునిగిపోయిన ఆ కాంతలకు నేను వచ్చేజన్మలో భర్తనయేటట్లు అనుగ్రహించు" అని మునిగాడు.

వాళ్ల కోర్కెల ప్రకారం ఆ అమ్మాయిలు నాలుగురాజకుటుంబాల్లో పుట్టారు. బ్రాహ్మణుడు ధారానగరంలో సింధులమహారాజు కుమారుడుగా పుట్టాడు. మన దేశంలో కీర్తి గడించిన భోజమహారాజు ఈయనే.

ఆ నలుగురమ్మాయిలు సుగంధి, పద్మగంధి, కనకవతి, చంద్రప్రభ, అనే పేరులతో భోజమహారాజుకు రాణీలయ్యారు!